క్లుప్తంగా

ఓపెన్ డ్రైనేజీ పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ సందరీకరణలో భాగంగా కాలనీ 18వ డివిజన్ అల్లూరు రోడ్ ఓపెన్ డ్రైనేజీని మంగళవారం మున్సిపల్ అధికారులు డీఈ రామన్, ఈఈ ప్రభు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. 17వ డివిజన్ నుంచి, 18వ డివిజన్ మీదుగా, 15వ డివిజన్, 19వ డివిజన్లను కలుపుకొని పారుతున్న ప్రధాన ఓపెన్ డ్రైనేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాలనీ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రామగుండం మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో డ్రైనేజీ కాలువ నిర్మాణ కోసం పరిశీలించారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మార్క రాజు, చక్రపాణి, రాములు, రాజేశం, అజయ్, నర్సింహారెడ్డి, కనుకయ్య, ప్రశాంత్, కుమార్, అనిల్ పాల్గొన్నారు.

బ్యాంకర్లతో సమీక్ష సమావేశం



సమీక్షిస్తున్న ఎంపీడీవో వేణుమాధవ్

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ బ్యాంకర్లతో ఎంపీడీవో బైరి వేణుమాధవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా వివిధ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అందించే రుణాల జారీ అంశాలపై బ్యాంకర్లతో సమావేశమయ్యారు. 14తో గడువు ముగియగా 1700 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 1400 అభ్యర్థులు దరఖాస్తులు ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించి చేపట్టాల్సిన విధివిధానాలు తదితర అంశాలపై సూచనప్రాయంగా చర్చించారు. బ్యాంకర్లకు మాత్రం ప్రభుత్వం నుంచి పథకానికి సంబంధించి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదని బ్యాంకర్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల నుంచి ప్రతినిధులు హాజరుకాగా మండల పరిషత్ సూపరింటెండెంట్ కరుణాకర్, ఏపీవో రమేశ్ ఉన్నారు.

యువత దేశసేవలో ముందుండాలి



మాట్లాడుతున్న కమాండింగ్ అధికారి జయంత్

జ్యోతినగర్: యువత దేశసేవలో ముందుండాలని తొమ్మిదో బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి జయంత్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రియ విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాహసం, ధైర్యం గల యువతకు త్రివిధ దళాల్లో, పారా మిలిటరీ దళాల్లో ఉపాధి అవకాశాలు అనేకం ఉన్నాయని వివరించారు. విద్యతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంచుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ శోభన్‌బాబు, ఎన్‌సీసీ ఇన్‌చార్జి వకీల్‌సింగ్, సీనియర్ అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ

జూలపల్లి: రాజీవ్ యువ వికాసానికి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. జూలపల్లితో పాటు 13 గ్రామ పంచాయతీల నుంచి నిరుద్యోగులు, మహిళలు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు సబ్సిడీ రుణాలకు ఎస్సీల నుంచి 407, ఎస్టీలు 11, బీసీలు 1163, మైనార్టీల నుంచి 28, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ నుంచి 15, మొత్తం 1624 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు ఎంపీడీవో పద్మజ వెల్లడించారు.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని ఇందుర్తి, పొత్కపల్లి, ఓదెల గ్రామాల్లో ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల నుంచి జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్ వైపు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేసి ధృవపత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

కంకర తేలి.. గుంతలు ఏర్పడి

- అధ్వానంగా మారిన ప్రధాన రహదారి
- ఏళ్లు గడిచినా పట్టించుకోని వైనం
- ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించాలని ప్రజల వినతి



గుంతమయంగా ఉన్న రోడ్డు

జ్యోతినగర్: నాలుగు గ్రామాల ప్రధాన రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వాహనదారులు ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇది రామగుండం కార్పొరేషన్‌లో ప్రధానమైన రోడ్డు. రోడ్డుపై గుంతలు ఏర్పడి కంకర తేలి తారు కనిపించని స్థితిలో అధ్వానంగా ఉంది. రోడ్డును బాగు చేయాలని ప్రజలు పలుమార్లు విన్నవించినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. గతంలో కార్పొరేటర్లు, నాయకులు ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. నిత్యం ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడినా పట్టించుకునే వారే కరువయ్యారు.

నిత్యం రద్దీ..

రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారి నుంచి సింధూర కళాశాల వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. నర్రాశాలపల్లె, రామయ్యపల్లె, మల్కాపూర్, జంగాలపల్లె గ్రామాలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం పలు వాహనాలు ఈ దారిగుండా వెళ్తాయి. ఈ రోడ్డులోనే ఫంక్షన్ హాల్లు, పెద్ద హోటళ్లు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. మరమ్మతు చేయాల్సిన అధికారులు దృష్టిసారించడం లేదు. వాహనాలు అదుపుతప్పి పలువురు గాయాలబారిన పడుతున్నారు.

ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించాలి..

ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత గ్రామాలైన నర్రాశాలపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిని గతంలో సీఎస్సార్ నిధులతో నిర్మించారు. రోడ్డు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో గుంతలమయంగా మారింది. సంస్థ మనుగడలో ప్రభావిత ప్రాంత ప్రజల సహకారం ఉన్నందున నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



రాజీవ్ రహదారి నుంచి సింధూర కళాశాల వైపు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఉన్నాయి. ప్రయాణం కష్టంగా ఉంది. పెద్ద పెద్ద గుంతల్లో వాహనాలు పడి చాలా మందికి గాయాలయ్యాయి. నిధులు కేటాయించి రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– జానకీరాం, ఎన్టీపీసీ మాజీ ఉద్యోగి

రోడ్డును బాగుచేయాలి



రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో బైక్‌పై వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రజలు, ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు రోజూ ఈరోడ్డు గుండా వెళ్తుంటారు. వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డును బాగు చేసేందుకు ఎవరూ చర్యలు తీసుకోవడం లేదు. పెద్ద ప్రమాదాలు జరగక ముందే బాగు చేయించాలి.

– గీట్ల తిరుపతిరెడ్డి, జంగాలపల్లె

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డు గతంలో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించారు. కొత్త రోడ్డు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఎన్టీపీసీ సంస్థకు సంబంధించిన అంశంపై కలెక్టర్ ద్వారా సీఎస్సార్ విభాగంతో పాటు హెచ్ఆర్ అధికారులకు తెలియజేస్తాం.

జె.అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. యైటింక్లయిన్ కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16నెలలు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఏర్పడిన త్యాగాల పార్టీ బీఆర్ఎస్ ఆవిర్భవించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. బహిరంగ సభలో అన్నివర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు మేడి సదయ్య, మాజీ కార్పొరేటర్ అంజలీదేవి, బాలరాజు, ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్, కుమార్ నాయక్, పాషా, సంపత్, సంధ్యారెడ్డి, రోజా, స్వరూప, జి.రవి, ఉదయ్, మోహన్, టి.కుమార్ పాల్గొన్నారు.

రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం అవాస్తవం

గోదావరిఖని: రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేయాలనే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. గోదావరిఖనిలోని తిలక్‌నగర్‌లో పంపిణీ చేసే సన్నబియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిశాయని ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా ప్రచారం చేశారన్నారు. దీనిపై స్పందించి తిలక్‌నగర్ ప్రాంతంలోని నాలుగు రేషన్ షాపులను రామగుండం సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేసి చెక్ చేసినట్లు పేర్కొన్నారు. అక్కడ ఎటువంటి ప్లాస్టిక్ బియ్యం సరఫరా లేదని ధ్రువీకరించామన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, కలెక్టర్ సూచనల మేరకు సంబంధిత అకౌంట్ హోల్డర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ జారీ చేశారన్నారు.

ఆదివారంపేటలో జై బాపు, జై భీం, జై సంవిధాన్

రామగిరి: మండలంలోని ఆదివారంపేటలో మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని మండల అధ్యక్షుడు రోద్ద బాపన్న అన్నారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైదం వరప్రసాద్, ఆరెల్లి కొమురయ్య, బొల్లపల్లి స్వామిగౌడ్, బర్ల శ్రీనివాస్, కాటం సత్యం, కండె పోచం, కొప్పుల గణపతి, అవినాష్, వేపచెట్టు రాజేశం, తిరుపతిరెడ్డి, నర్సింగరావు పాల్గొన్నారు.

కర సేవకులకు సన్మానం



సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గోదావరిఖనిటౌన్: అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం 35ఏళ్ల క్రితం గోదావరిఖని ప్రాంతం నుంచి బయలుదేరి నెలరోజుల పాటు 800 కిలోమీటర్లు నడిచి అయోధ్య చేరుకున్న కర సేవకులను సోమవారం రాత్రి సన్మానించారు. స్థానిక శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంత్‌గౌడ్ వారిని సన్మానించారు. బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనగర్ మండల అధ్యక్షుడు కోడూరి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముస్కుల భాస్కర్‌రెడ్డి, కోమల్ల మహేశ్, అపర్ణ, రాకేశ్, అండె రాజ్‌కుమార్, మేరుగు శ్రీనివాస్, గంధం అజయ్, పెండ్యాల రఘు, జక్కన్న, బాలకృష్ణ, మ్యాదరవేన రాకేశ్, మేకల ఆమని, బుంగ మహేశ్ పాల్గొన్నారు.

వైభవంగా కాటమయ్య ఉత్సవం



ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో గీత కార్మికులు మంగళవారం కాటమయ్యకు ప్రత్యేక పూజలు చెల్లించారు. ఈ సందర్భంగా కాటమయ్య దేవుడికి తాటిముంజలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గీతకార్మిక సంఘం సభ్యులు భూసారపు నర్సయ్య, పూదరి వెంకటేశం పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, గుండారం, రాజాపూర్, పేరపల్లి, సిద్దిపల్లె, ముల్కపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం శైలజకాంతి తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో సదయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈవో ఆధ్వర్యంలో ధర్మకర్తలు, ముతవల్లి అర్చక బృందం, గ్రామ పెద్దల సమక్షంలో ఎండోమెంట్ ఉద్యోగులు బ్రహ్మోత్సవాల హుండీలను లెక్కించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సంక్షిప్త వార్తలు

• ఎల్‌వోసీ అందజేత

ముత్తారం: మండలంలోని ఓడెడ్‌కు చెందిన మహమ్మద్ చాంద్ పాషా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించగా ఆయన మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ నిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం బాధితుడికి అందజేశారు.

• మండల బ్యాండ్ కమిటీ ఎన్నిక

ముత్తారం: మండల బ్రాస్ బ్యాండ్ కమిటీ ఎన్నిక మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ కమిటీ మండల గౌరవ అధ్యక్షుడిగా ఎండీ రహీం, అధ్యక్షుడు కలవేన శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మడిపల్లి దేవేందర్, కండె సదయ్య, ప్రధాన కార్యదర్శిగా కండె శేఖర్, సహాయ కార్యదర్శిగా ఎండీ ఖాసీమ్, కోశాధికారి బండ శంకర్, మల్యాల రాంచంద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎండీ రాజ్‌మహమ్మద్, యూసుఫ్, తగరం లింగయ్య, ఇరికిల్ల శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

• ఘనంగా శ్రీసీతారాముల పట్టాభిషేకం

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం శ్రీసీతారాముల సామ్రాజ్య పట్టాభిషేకోత్సవం ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖరశర్మ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోలాహలం శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివప్రసాద్, కోశాధికారి జాగటి శ్రీకాంత్‌కుమార్, రవికుమార్ హాజరయ్యారు.

• అమ్మ కళ్లు సజీవం

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన సంద చంద్రకళ (60) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందింది. కాగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు మంగళవారం దానం చేశారు. స్థానిక మార్కండేయ కాలనీకి చెందిన సంద గోపతి అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి భార్య చంద్రకళ, సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. నేత్రదానంపై ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ అవగాహన కల్పించారు. దీంతో మృతురాలి భర్త గోపతి, కొడుకులు, కోడళ్లు సాగర్-జ్యోతి, కుమార్-సౌజన్య, కూతురు, అల్లుడు స్వప్న-మధు స్పందించారు. మృతురాలి నేత్రాలను టెక్నీషియన్ సేకరించి, హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ ఐబ్యాంక్‌కు తరలించారు. నేత్రీదాత కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, భీష్మాచారి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సలహాదారులు నూక రమేశ్, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్ అభినందించారు.

• చలివేంద్రం ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రగతినగర్ ప్రాంతంలో మంగళవారం సయ్యద్ బ్రదర్స్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) ఉప్పు రాజు ప్రారంభించారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన సయ్యద్ బ్రదర్స్‌ను రాజు అభినందించారు. ఖాలీద్, ఇంత్యాజ్, అలీం, శ్యాం, నర్సింగం, అశోక్, సాయిలు, కళ్యాణ్ ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ వాసంతి ప్రారంభించారు. కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వారి దాహార్తి తీసుకునేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ఐ వాసంతి, సీనియర్ అసిస్టెంట్ సతీశ్, ప్రదీప్, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

మంథని: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తే నియంత్రించవచ్చని మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంథని ఆర్టీసీ డిపోలో మేనేజర్, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్‌మెన్ మేడ దేవేందర్, ఫైర్‌మెన్‌లు దేవేందర్, రఘు, డ్రైవర్ రమేశ్, నాగరాజు ఉన్నారు.

సింగరేణి వార్తలు

బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా సమ్మె



మాట్లాడుతున్న నర్సింహారావు

గోదావరిఖని: బొగ్గుగనుల వేలం, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, ప్రైవేటీకరణ, కొత్త లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు కార్మికులను కోరారు. ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత నెల 18న న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు సమావేశమై ఈ సమ్మె నిర్ణయం తీసుకున్నటు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న కొత్త లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోవాలని, బొగ్గు గనుల వేలం ఆపి కోల్ ఇండియా, సింగరేణికి కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఒక్క రోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, ఆసరి మహేశ్, పి.రాజేశ్వరచారి, ఎం.రాజేశ్వరరావు, నంది నారాయణ, బాదె రవి, సంతోష్, బొడ్డుపల్లి రవి, కె.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2లో సర్వే అధికారిగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న బుక్యా దేశాయ్‌ని మంగళవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం రాముడు సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, వర్క్‌షాప్ ఏజీఎం ఎర్రన్న, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆటోడ్రైవర్ల విరాళం



విరాళం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

గోదావరిఖని: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆటో డ్రైవర్లు రూ.50వేల విరాళం అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు బీఆర్‌టీయూ ఆటో యూనియన్ నాయకులు విరాళం అందించారు. యూనియన్ నాయకులు వేముల మారయ్య, నీలారపు రవి, రేణిగుంట్ల సురేశ్, ఆయుధాల సదానందం, పసుపుల విజయ్‌కుమార్, మాతంగి సురేశ్, కనుకుంట్ల రాజేందర్, రమేశ్, నారమళ్ల అనిల్, నేతగాని శ్రీనివాస్, అన్నారపు నరేందర్, రాచర్ల రవీందర్ పాల్గొన్నారు.

అధికారికి అభినందనలు



సన్మానిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3లో బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న తిరుపతిరెడ్డి ఈనెల13న సింగరేణి నిర్వహించిన బయోకెమిస్ట్రీ పరీక్షల్లో మొదటి ర్యాంకులో పాసై అధికారిగా పదోన్నతి పొందాడు. పదోన్నతి సాధించిన నల్ల తిరుపతిరెడ్డిని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మంగళవారం సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు చెల్పూరి సతీశ్, సెబాస్టియన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్ స్పాట్ల పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్సై చంద్రకుమార్

రామగిరి: మండంలోని కల్వచర్ల నుంచి రామయ్యపల్లి వరకు మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్ స్పాట్లను మంగళవారం ఎస్సై చంద్రకుమార్ పరిశీలించారు. సుమారు 13 కిలోమీటర్ల దూరంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి నియంత్రణ చర్యలు చేపట్టారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దని పోలీసులకు సహకరించాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ సాయి తేజ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ పెంపొందుతుంది



ఎన్‌సీసీ విద్యార్థులను అభినందిస్తున్న కల్నల్

గోదావరిఖనిటౌన్: ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ పెంపొందుతుందని, సామాజిక సేవా స్పృహ ఏర్పడుతుందని 9వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత్ అన్నారు. స్థానిక సెక్రెడ్ హార్ట్ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచి రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొన్న విద్యార్థులను, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి, టీకలాను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, సూర్యప్రసాద్, అన్మోల్‌సింగ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత తానిపర్తి కాంతారావు సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని సంతాపం తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీలు బాలాజీరావు, తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, సంజీవరావు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. సమావేశంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు సురేశ్‌రెడ్డితో పాటు నాయకులు శ్రీనివాసరావు, నరేందర్‌రావు, మల్లేశం, రమేశ్, సతీశ్, హన్మంతు, సురేందర్ పాల్గొన్నారు.

ఘన స్వాగతం..

ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి పెద్దపల్లికి వచ్చిన కొమురయ్యకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఒగ్గుకళాకారులు, డోలుదెబ్బతో విన్యాసాలు చేస్తూ పట్టణ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ నాయకులు చిలారపు పర్వతాలు, రాకేశ్, రమేశ్, రాజగోపాల్, శంకర్ ఎమ్మెల్సీని సత్కరించారు.